# కష్టపడితేనే విజయం



పోలీస్ ఉద్యోగం సాధించిన అభ్యర్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- ఒక అడుగుతోనే ప్రయాణం మొదలవుతుంది
- ఉద్యోగాలు సాధించిన ప్రతిఒక్కరికీ అభినందనలు
- దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఉచిత శిక్షణ ద్వారా ఎంపికైన అభ్యర్థుల అభినందన సభ



పాల్గొన్న పోలీస్ ఉద్యోగం సాధించిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 7: కష్టపడి విజయం సాధిస్తే వచ్చే ఆనందం ఎంతో తృప్తినిస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. శుక్రవారం రాత్రి సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ఉచిత పోలీస్ శిక్షణ ద్వారా ఎంపికైన 99మంది కానిస్టేబుళ్లు, ఎస్సైలకు నిర్వహించిన అభినందన సభలో సీపీ శ్వేత తోపాటు మంత్రి పాల్గొన్నారు. ముందుగా ఎంపికైన కానిస్టేబుళ్లు, ఎస్సైలు మాట్లాడి మంత్రి హరీశ్‌రావు, సీపీ శ్వేత సహకారాలతో నిర్వహించిన పోలీస్ శిక్షణ ద్వారా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనుకున్నది సాధించి సార్థకత తెచ్చారని, ఆత్మవిశ్వాసంతో దించినతల ఎత్తకుండా చదివితే ఉద్యోగం వస్తున్నదని నిరూపించారని అభినందించారు. మీరంతా కష్టపడి చదివి ఉద్యోగాన్ని పొందారని, బయట ఎంతో దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని హితవు పలికారు. ఉచిత పోలీస్ శిక్షణతో తల్లిదండ్రులు తలెత్తుకునేలా, మరొకరికి స్ఫూర్తిగా ఉండేలా మీరు సాధించిన విజయానికి తృప్తిగా ఉందన్నారు. తాను మోరల్‌గా సపోర్ట్ చేశానని, సీపీ శ్వేత, భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు భాగ్యకిరణ్ కృషి ఫలితం, పోలీస్ అధికారులు, సిబ్బంది కృషితో ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత ప్రతిఒక్కరూ ప్రజాసేవ చేసి ఇద్దరికి సహాయ పడినప్పుడే మీ జన్మ సార్థకమవుతుందన్నారు. ప్రతివ్యక్తి జీవితంలో ఒక్క అడుగుతోనే ప్రయాణం మొదలవుతుందని, అదే ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ చాలామంది పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చి ఉద్యోగాలు సాధించినందుకు అభినందనలు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో శిక్షణ ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వ ఫిజికల్ టీచర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఎనలేని కృషిచేశారని వారిని అభినందించారు. భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకు భాగ్యకిరణ్ సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్‌లలో వారి ఫ్యాకల్టీతో శిక్షణ ఇప్పించడం ద్వారా ఉద్యోగాలు సాధించిన అభినందించారు. ఉద్యోగం పొందిన వారందరూ నేటి నుంచి పోలీస్ అధికారులని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణగా ఉండి ట్రైనింగ్ పూర్తి చేసుకొని సమాజ సేవ చేసి పది మందికి సహాయపడాలని సూచించారు. అంతకు ముందు మంత్రి హరీశ్‌రావు ఎంపికైన ఉద్యోగార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, మల్లారెడ్డి, భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ ఎండీ భాగ్యకిరణ్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.





పోలీస్ ఉద్యోగం సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, సీపీ శ్వేత

# సిద్దిపేట ఫుట్‌పాత్‌లకు కొత్త లుక్

- వీధిదీపాలను ప్రారంభించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలో ఫుట్‌పాత్ లైట్లను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 7 : మహానగరానికి తీసిపోని విధంగా సిద్దిపేట రూపాంతరం చెందిందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం రాత్రి సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధిదీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్టాండ్ నుంచి హైదరాబాద్ రోడ్డు పొన్నాల జంక్షన్ వరకు 394 స్తంభాలు, బస్టాండ్ నుంచి మెదక్ రోడ్డు ఇందిరాగాంధీ సర్కిల్ వరకు 198 స్తంభాలు, బస్టాండ్ నుంచి కరీంనగర్ రోడ్డు వేములవాడ కమాన్ వరకు 178 స్తంభాలు మొత్తం 770 స్తంభాలకు ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లతో ఆయా ప్రాంతాలన్నీ మెరుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# అర్హులందరికీ గృహలక్ష్మి

**ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, అక్టోబర్ 7: అర్హులైన ప్రతిఒక్కరికీ గృహలక్ష్మి పథకాన్ని విడతల వారీగా అందిస్తామని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నా రు. సీఎం క్యాంపు కార్యాలయ ఆవరణలో 19వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గృహలక్ష్మి ఇండ్లను మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.3లక్షల ఆర్థిక సాయం అర్హులైన నిరుపేదలకు అందిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నారని, తొమ్మిదిన్నరేండ్లలో అన్నిరంగాల్లో గజ్వేల్ అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీషారాజు తదితరులు ఉన్నారు.




గోనెపల్లి, ఇబ్రహీంనగర్ వాగుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి

# ఇక సాఫీగా ప్రయాణం

- రూ.5 కోట్ల 60 లక్షలతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి ప్రారంభం
- మంత్రి హరీశ్‌రావు సహకారంతో అభివృద్ధి పరుగులు
- జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ
- చిన్నకోడూరు మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చిన్నకోడూరు, అక్టోబర్ 7 : హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణంతో ప్రజల ప్రయాణం సాఫీగా సాగనున్నదని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు కృషితో మండలంలోని రామునిపట్ల–గోనెపల్లి వాగుపై రూ. 14.45 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన, గోనెపల్లి–ఇబ్రహీంనగర్ వాగుపై రూ.5.60కోట్లతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డితో కలిసి శనివారం జడ్పీ చైర్‌పర్సన్ శనివారం ప్రారంభించారు. మండలంలోని అనంతసాగర్‌లో రూ.10లక్షలతో రెడ్డి సంఘం, రూ.20 లక్షలతో ఏఎన్ఎం సెంటర్, ఇబ్రహీంనగర్‌లో రూ.10లక్షలతో యాదవ సంఘం, రూ.10లక్షలతో మున్నూరు కాపు సంఘం, గోనెపల్లిలో రూ.10లక్షలతో గౌడ సంఘం, రామునిపట్లలో రూ.10లక్షలతో గౌడ సంఘం, రూ.20 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి ఎదురు చూస్తున్న గోనెపల్లి–ఇబ్రహీంనగర్ వాగుపై హైలెవల్ బ్రిడ్జిల అందుబాటులోకి రావడంతో ప్రజలు, రైతుల ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేట నలుమూలల అభివృద్ధి కొనసాగుతున్నదన్నారు. సిద్దిపేట చుట్టు నిర్మిస్తున్న రింగురోడ్డు పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. జాతీయ స్థాయిలో గ్రామాలు అవార్డులు సాధించడం గొప్ప విషయమన్నాను. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ రామ్‌చంద్రం, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందంగౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ